# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 165 | పేజీలు : 08 | మంగళవారం | 23-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## కేసీఆర్ అంత
# మంచోణ్ని కాదు..

- నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు.. వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా: కేటీఆర్
- ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్
- మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ
- సప్తసముద్రాలు దాటినా వెతికి పట్టుకొస్తానని శపథం
- వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడుకి, ఆయన బృందానికి సినిమా చూపిస్తానన్న కేటీఆర్
- వర్ధన్నపేట కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు

2



# మెట్రో ఫేజ్-2 అనుమతులపై చర్చ

**రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి భేటీ**

- మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి భేటీ
- మెట్రోరైలు ఫేజ్-2కు అనుమతులపై అశ్వినీవైష్ణవ్‌తో చర్చ

హైదరాబాద్ పల్స్,ఢిల్లీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వీనీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన రైల్వేమంత్రితో రైల్‌భవన్‌లో సమావేశం అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతుల అంశంపై ఆయనతో చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించినట్లుగా సమాచారం.ఇటీవల కేంద్రమంత్రి కిషన్? రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖను రాసిన విషయం తెలిసిందే.

2



# 100 సీట్లు పక్కా

**వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా: మహేశ్ కుమార్ గౌడ్**

- ఓట్ల దొంగతనంతో పాటు ని బీజేపీ సీట్ల దొంగతనానికీ పాల్పడుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ
- సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని వెల్లడి

2



# తొక్కించి చంపేస్తారా?

- డీటీఓ వెంకన్న మృతిపై హరీశ్‌రావు అనుమానాలు!
- తనిఖీలు నిర్వహిస్తుండగా డీటీఓ వెంకన్నను ఢీకొన్న టిప్పర్
- అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన వెంకన్న
- అక్రమాలను అడ్డుకుంటే లారీలతో తొక్కించి చంపేస్తారా? అని ప్రశ్నించిన హరీశ్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న దుర్మరణం చెందిన ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ రోడ్డు ప్రమాదంపై అనుమానాలు

2




# రాజీనామా!

- బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..
- ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!
- లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
- సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి
- దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయమని స్టార్మర్ వ్యాఖ్య
- 100 మందికిపైగా ఎంపీల నుంచి రాజీనామా డిమాండ్
- పదేళ్లలో బ్రిటన్‌కు ఏడో ప్రధాని మార్పు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ

# రాజీపడే ప్రసక్తే లేదు

- నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై
- ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ
- ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష
- తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్
- జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి

# 10 సూత్రాల అమలు..

**సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం**

- స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం
- ప్రణాళికా విభాగంతో కేఆర్ఈఏ వర్సిటీకి చెందిన ఐఎఫ్ఎంఆర్ ఎంఓయూ
- 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- జీరో పావర్టీ, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై తొలుత దృష్టి
- పది సూత్రాల అమలుకు రాష్ట్రస్థాయి కమిటీ, వర్కింగ్ గ్రూపుల ఏర్పాటు

2



హైదరాబాద్ పల్స్,అమరావతి

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047 విజన్' అమలులో ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా నిర్దేశించిన పది సూత్రాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రణాళికా విభాగం, కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) మధ్య సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు

## ఢిల్లీలో ఒక నీతి.. హైదరాబాద్‌లో ఒక రీతా?

**రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీకి దాసోజు శ్రవణ్ లేఖ**


2

- విదేశీ విధానాల్లో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాలను పాటిస్తోందన్న శ్రవణ్
- ట్రంప్ ను ప్రసన్నం చేసుకోవడానికి మోదీ దేశ గౌరవాన్ని తాకట్టు పెట్టారని కాంగ్రెస్ నేత అన్నారని వ్యాఖ్య
- తెలంగాణలో ట్రంప్ టవర్స్ కు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని విమర్శ

## లక్నో అగ్నిప్రమాదంలో
# 14 మంది మృతి..

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ**


2

- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు

**వర్చువల్‌గా కోర్టుకు అల్లు అర్జున్ హాజరు**


2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నాంపల్లి కోర్టు విచారణకు హీరో అల్లు అర్జున్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు నాంపల్లి కోర్టు అనుమతివ్వడంతో ముంబై నుంచి వర్చువల్‌గా అల్లు అర్జున్ అటెండ్ అయ్యారు. ఈ కేసులో మిగిలిన నిందితులు వ్యక్తిగతంగా కోర్టు ముందు

హైదరాబాద్ పల్స్
epaper.hyderabadpulsenews.in
GENERAL NEWS
మంగళవారం
23-06-2025


# 100 సీట్లు పక్కా

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.

# కేసీఆర్ అంత మంచోణ్ని కాదు..

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా విడిచిపెట్టను" అని అన్నారు. కార్యకర్తలను వేధించిన వారు ఎక్కడున్నా వదలబోమని కేటీఆర్ హెచ్చరించారు. "రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది. వదిలిపెట్టే సమస్యే లేదు. ఇది ఊరికే చెప్పడం లేదు, గుర్తు పెట్టుకోండి" అని ఆయన వ్యాఖ్యానించారు

# రాజీనామా!

మొదటి పేజీ తరువాయి

నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు

మొదటి పేజీ తరువాయి

హాజరయ్యారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఏ 11 గా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ వ్యక్తిగతంగా కోర్టు ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది. సినిమా షూటింగ్‌ల కారణంగా అర్జున్ ముంబైలో ఉన్నారని, అక్కడి నుంచి వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫున న్యాయవాది మెమో దాఖలు చేయగా.. అందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో ఈరోజు మధ్యాహ్నం నాంపల్లి కోర్టు ముందు అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా హాజరయ్యారు. దీన్ని కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసు తదుపరి విచారణను నాంపల్లి కోర్టు జులై 6కు వాయిదా వేసింది. ఆరోజు కూడా కోర్టుకు అల్లు అర్జున్ వ్యక్తిగతంగా హాజరుకానున్నారా లేక వర్చువల్‌గానే అటెండ్ అవుతారా అనేది చూడాల్సి ఉంది.

# తొక్కించి చంపేస్తారా?

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మరణం కేవలం ఒక యాక్సిడెంట్ మాత్రమే కాదనే బలమైన సందేహాన్ని హరీశ్‌రావు లేవనెత్తారు. "రాష్ట్రంలో అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియాల ఆటలు మితిమీరిపోయాయి. నిజాయతీగా పనిచేసే అధికారులు వారి అక్రమాలకు అడ్డొస్తే... ఇలా లారీలతో తొక్కించి ప్రాణాలు తీస్తారా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. భూపాలపల్లి ఏరియాలో సాగుతున్న అక్రమ ఇసుక, బొగ్గు రవాణా వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరు? వారికి సహకరిస్తున్న లీడర్స్ ఎవరు? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వెంకన్న ప్రమాదం వెనుక దాగిన నిజాన్ని పూర్తిగా వెలికితీయాల్సిన బాధ్యత ముమ్మాటికీ రాష్ట్ర సర్కార్ పైనే ఉందన్నారు. కేవలం డ్రైవర్‌ను అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటే కుదరదని... ఈ కేసుపై ఒక ఉన్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి, దీని వెనుక ఎవరి ప్రేరేపణ అయినా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేయాలన్నారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించడంతో పాటు, భవిష్యత్తులో విధుల్లో ఉండే అధికారులకు ఇలాంటి దారుణాలు జరగకుండా పకడ్బందీ రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# రాజీపడే ప్రసక్తే లేదు

మొదటి పేజీ తరువాయి

అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు

## లక్నో అగ్నిప్రమాదంలో
# 14 మంది మృతి..

మొదటి పేజీ తరువాయి



ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# 10 సూత్రాల అమలు..

మొదటి పేజీ తరువాయి

సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటును సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. 2014-19 మధ్య కాలంలో 13.5 శాతం సగటు వార్షిక వృద్ధి రేటును (సీఏజీఆర్) సాధించామని, అయితే గత ఐదేళ్లలో వివిధ కారణాల వల్ల అది 11 శాతానికి పరిమితమైందని విశ్లేషించారు. ఇప్పుడు నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ), వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్‌ను ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతలను ఐఎఫ్ఎంఆర్ చూస్తుంది. తొలిదశలో జీరో పావర్టీ (పేదరిక నిర్మూలన), వాటర్ సెక్యూరిటీ (జల భద్రత), డీప్ టెక్నాలజీ మిషన్లపై ఐఎఫ్ఎంఆర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయనుంది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, విధానపరమైన సూచనలు అందించడంతో పాటు, వినూత్న పద్ధతులను సిఫారసు చేస్తుంది. ఈ పది సూత్రాల అమలును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీతో పాటు, మిషన్ వర్కింగ్ గ్రూపులను కూడా ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలోని అన్ని రంగాల అభివృద్ధికి డీప్ టెక్‌ను అనుసంధానం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్, ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, సెమీ కండక్టర్స్, రక్షణ రంగాల్లో కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని గుర్తుచేశారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీలను సైతం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# ఢిల్లీలో ఒక నీతి.. హైదరాబాద్‌లో ఒక రీతా?

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ విదేశీ విధానాల్లో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శిస్తూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ లేఖ రాశారు. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ చెప్పే జాతీయ, అంతర్జాతీయ సిద్ధాంతాలకు.. హైదరాబాద్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న 'రోడ్డు నాటకాలకు' అస్సలు పొంతన లేదంటూ ధ్వజమెత్తారు. "గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారూ.. నేను ఈ లేఖను మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి రాయడం లేదు. జాతీయ స్థాయిలో ఏఐసీసీ చెబుతున్న సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధంగా తెలంగాణలో మీ సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న ప్రైవేట్ ఫ్రాంచైజీ-రాజకీయాలను బట్టబయలు చేయడానికే రాస్తున్నా" అని లేఖలో శ్రవణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒకే విధమైన నిర్దిష్ట సిద్ధాంతం ఉందా, లేక రాష్ట్రాల్లో అవకాశవాదం కోసం విలువలను తాకట్టు పెడతారా అని నిలదీశారు. జూన్ 20న కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి పవన్ ఖేరా విడుదల చేసిన అధికారిక ప్రకటనను శ్రవణ్ ఈ లేఖకు జతచేశారు. ఆ ప్రకటన ప్రకారం... గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం 'ఇండియా ఫస్ట్' కాకుండా 'పీఆర్ ఫస్ట్' (ప్రచారం కోసం)లా సాగిందని కాంగ్రెస్ ఆరోపించిందని శ్రవణ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవడం కోసం మన సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టారని, ట్రంప్ భారత్‌ను చిన్నచూపు చూస్తూ 'ఆదేశాల భాషలో' మాట్లాడుతున్నారని, ఆయన ముందు మోదీ మోకరిల్లడం 140 కోట్ల మంది భారతీయులకు సిగ్గుచేటని ఢిల్లీలో కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించిందని చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ట్రంప్‌ను అంతలా విమర్శించిన కేవలం మూడు రోజులకే.. అంటే జూన్ 23న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే డొనాల్డ్ ట్రంప్ కోసం హైదరాబాద్‌లో రెడ్ కార్పెట్ పరుస్తున్నారని శ్రవణ్ విమర్శించారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో, యూఎస్ కాన్సులేట్ పక్కనే... కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఏకంగా 'డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ'ను అధికారికంగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోందని అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా ఈ రాజకీయ ద్వంద్వ నీతిని మీరు ఎలా సమర్థిస్తారంటూ రాహుల్ గాంధీని శ్రవణ్ సూటిగా ప్రశ్నించారు.

# మెట్రో ఫేజ్-2 అనుమతులపై చర్చ

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ నగరంలో మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేవిధంగా చూడాలని లేఖలో కోరిన విషయం తెలిసిందే. రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే ముగ్గురు సమావేశం అవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**

అంతకు ముందు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో దాదాపు 20 నిమిషాల పాటు పలు అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామని రక్షణ మంత్రి హామీ ఇచ్చారు. వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, హ్యాంగర్, ఎమ్ఆర్‌వో సౌకర్యాలు కల్పించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని ఆయన కోరారు.



# జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
రాబోయే పల్స్ పోలియో కార్యక్రమం, స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జాతీయ పురుగుల నివారణ దినోత్సవం (ఎన్ డి డి) కార్యక్రమం అమలుపై సమీక్షించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్తో పాటు సంబంధిత శాఖల అధికారులు మరియు టాస్క్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో బూత్ డే కార్యక్రమం, అనంతరం జూన్ 29 మరియు 30 తేదీలలో ఇంటింటి సర్వే కార్యక్రమం, జూన్ 1



నుండి జూలై 31 వరకు నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్, అలాగే జూలై 13న నిర్వహించనున్న జాతీయ పురుగుల నివారణ దినోత్సవం ( ఎన్ డి డి ) కార్యక్రమాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, ప్రజల్లో అవగాహన కల్పించడం, లక్షిత లబ్ధిదారులకు సేవలు అందించడం వంటి అంశాలపై చర్చించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పటిష్ట పర్యవేక్షణ చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. డా. ప్రతాప్ జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనిజేషన్ అధికారి.

# ప్రతి టన్ను బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ

### అత్యాధునిక సాంకేతికతతో పారదర్శక రవాణా వ్యవస్థ

### కొత్తగూడెం ఏరియా జిఎం శాలెం రాజ్

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మైనింగ్ రంగంలో 137 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీని కొందరు ప్రజా ప్రతినిధులు వ్యాఖ్యలను ఖండిస్తూ కొత్త గూడెం ఏరియా జిఎం శాలెం రాజ్ మీడియాతో మాట్లాడుతూ దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తూ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ జాతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవల సింగరేణిలో బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో బొగ్గు చోరీలు జరిగాయని చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉండటమే కాకుండా, సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాల గురించి కొన్ని వాస్తవాలను మీతో పంచుకోవడం అవసరమని భావిస్తున్నాం. రవాణా వ్యవస్థ సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా చేయబడుతోంది. బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశలో డిజిటల్ పర్యవేక్షణ, భద్రతా తనిఖీలు, ఆన్లైన్ రికార్డింగ్ వ్యవస్థలు అమల్లో ఉంటాయి. రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా హైదరాబాద్ లోని మార్కెటింగ్ విభాగం ద్వారా ూ్రూ ఆధారిత వ్యవస్థలో బొగ్గు కేటాయింపులు జరుగుతాయి. ఏ వినియోగదారుడు ఏ గని నుంచి, ఎంత పరిమాణంలో, ఎప్పుడు బొగ్గు స్వీకరించాలో ముందుగానే డిజిటల్గా కేటాయించబడుతుంది. వాహనం గని లేదా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ వద్దకు చేరిన వెంటనే: ఖాళీ వాహనం బరువును ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జిపై నమోదు చేస్తారు. వాహనం నంబర్, వినియోగదారుడి వివరాలు వ్యవస్థలో నమోదవుతాయి. బొగ్గు లోడింగ్ నిర్వహిస్తారు. నిర్దేశిత పరిమాణంలో



అనంతరం ఆధారిత బూమ్ బ్యారియర్లు కలిగిన వే బ్రిడ్జిల వద్ద మళ్లీ తూకంవేస్తారు. కేటాయించిన పరిమాణానికి అనుగుణంగా బొగ్గు లోడ్ అయిన తర్వాత మాత్రమే కంప్యూటర్ జనరేట్ చేసిన అధికారిక వే-బిల్ జారీ చేసి వాహనాన్ని విడుదల చేస్తారు. వాహనం బయలుదేరిన వెంటనే ఆ సమాచారం వినియోగదారుడికి, మార్కెటింగ్ విభాగానికి, సంబంధిత అధికారులకు ఆన్లైన్ ద్వారా చేరుతుంది. జియోఫెన్సింగ్ ఆధారిత పర్యవేక్షణ బొగ్గు రవాణా చేసే వాహనాలన్నింటికీ ట్రాకింగ్ వ్యవస్థ అమలులో ఉంది. వాహనం ఎక్కడ ఉంది? ఏ మార్గంలో వెళ్తుంది? ఎక్కడ ఆగింది? గమ్యస్థానానికి చేరిందా? అనే వివరాలు రియల్టైమ్ పర్యవేక్షించబడతాయి. జియోఫెన్సింగ్ సాంకేతికత కారణంగా వాహనం నిర్దేశిత మార్గం నుంచి మళ్లితే సంబంధిత గని మేనేజర్, ప్రాజెక్ట్ అధికారి, సెక్యూరిటీ ఆఫీసరు వెంటనే హెచ్చరికలు వెళ్తాయి. బూమ్ బ్యారియర్ల సమగ్ర నిఘా సింగరేణి గనులు, వెయిబ్రిడ్జ్ సి ఎస్ పి లు ఎంట్రీ-ఎగ్జిట్ గేట్లు, రైల్వే సైడింగ్స్, స్టాక్ యార్డుల వద్ద ఆధారిత బూమ్ బ్యారియర్లు, సి సీ టీ వి కెమెరాలు ఏర్పాటు చేయబడ్డాయి. వందలాది సీసీటీవీ కెమెరాలు 24 గంటలూ పనిచేస్తూ ప్రతి కదలికను రికార్డు చేస్తున్నాయి. సింగరేణిలోని అన్ని వెయిబ్రిడ్జ కోల్ నెట్ డిజిటల్ వ్యవస్థకు అనుసంధానించబడ్డాయి. ప్రతి లారీ, ప్రతి వ్యాగన్ బరువు ఆన్లైన్లో నమోదు అవుతుంది. లోడింగ్ పాయింట్ వద్ద నమోదైన బరువు, అన్లోడింగ్ సమయంలో నమోదైన బరువుతో సరిపోల్చబడుతుంది. ఏదైనా తేడా ఉంటే సంబంధిత రవాణా కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం వసూలు చేయబడుతుంది. చెకోపోస్టులు – భౌతిక తనిఖీలు అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాల వద్ద చెకో పోస్టులు. వాహనాల భౌతిక తనిఖీలు. హోలోగ్రామ్ కలిగిన అధికారిక చలానాలు. రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్ల ప్రకారం విద్యుత్ కేంద్రాలు ఇతర భారీ వినియోగదారులు సింగరేణి వివిధ సి ఎస్ పి ల నుంచి బొగ్గు స్వీకరిస్తారు. రైల్వే శాఖ కేటాయించిన రేకుల్లో ప్రతి వ్యాగన్కు నిర్దిష్ట పరిమాణంలో బొగ్గు లోడింగ్ జరుగుతుంది. మొత్తం ప్రక్రియ సప్ ఆధారంగా నిర్వహించబడుతుంది. లోడింగ్ పూర్తయిన వెంటనే వినియోగదారునికి డిజిటల్ సమాచారం అందుతుంది. అనంతరం రైల్వే శాఖ బొగ్గును గమ్యస్థానానికి తరలిస్తుంది. ప్రతీ రోజూ గస్తీ సింగరేణి సెక్యూరిటీతో గస్తీ. ఫ్లయింగ్ స్క్వాడ్లు ఆకస్మిక తనిఖీలు. చెకోపోస్టులు, స్టాక్ యార్డులు, రవాణా మార్గాలపై సర్ప్రైజ్ రైడ్లు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుని వరకు ప్రతి టన్ను బొగ్గు రిడ్, ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్ ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళస్థాయి సాంకేతికత, భద్రతా వ్యవస్థల మధ్య నిర్వహించబడుతోంది. అందువల్ల బొగ్గు మాయమవడం లేదా చోరీ జరగడం వంటివి అసత్య ఆరోపణలు. ప్రతి టన్ను బొగ్గు – డిజిటల్ పర్యవేక్షణలో ప్రతి రవాణా – భద్రతా నిఘాలో పారదర్శకత, బాధ్యత, సాంకేతికత ఇవే సింగరేణి బొగ్గు నిర్వహణకు మూల సూత్రాలు.

### భారత్ రక్షణ కవచంపై దుబాయ్ కన్ను..!

# బ్రహ్మోస్, ఆకాశ్‌తీర్ కోసం యూఏఈ ఆరాటం..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, సెంట్రల్ డెస్క్ :**
భారతదేశ రక్షణ రంగానికి అంతర్జాతీయంగా డిమాండ్ వేగంగా పెరుగుతోంది. గల్ఫ్ ప్రాంతంలో భద్రతా ముప్పుల నేపథ్యంలో, అక్కడి కీలక దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భారత్‌కు చెందిన అధునాతన రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన క్షిపణిగా పేరొందిన 'బ్రహ్మోస్' సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, అలాగే వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన 'ఆకాశ్‌తీర్' ఎయిర్ డిఫెన్స్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ ఉన్నాయి. ఈ రక్షణ ఒప్పందానికి సంబంధించిన ప్రాథమిక స్థాయి చర్చలు ఇరు దేశాల మధ్య ప్రస్తుతం అత్యంత వేగంగా పురోగమిస్తున్నాయని రక్షణ వర్గాలు వెల్లడించాయి.

**బ్రహ్మోస్, ఆకాశ్ తీర్ పై యూఏఈ కన్ను**
మధ్యప్రాచ్యంలో మారుతున్న భద్రతా సమీకరణాలు, ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా యూఏఈ తన రక్షణ సామర్థ్యాలను పునర్వ్యవస్థీకరించుకోవాలని భావిస్తోంది. వైమానిక దాడులు, డ్రోన్లు మరియు క్షిపణి ముప్పుల నుండి కీలక ప్రాంతాలను రక్షించుకోవడంతో పాటు, చమురు ఎగుమతులకు



మార్గమైన హోర్ముజ్ జలసంధి భద్రతను బలోపేతం చేయడం యూఏఈ తక్షణ ప్రాధాన్యతగా మారింది. ఇందుకోసం రక్షణ వనరుల కొనుగోలులో కేవలం ఒక్క దేశంపైనే ఆధారపడకుండా, భారత్ వంటి మైత్రి దేశాలతో భాగస్వామ్యం వైపు మొగ్గు చూపుతోంది.

**ప్రత్యేకతలివే**
భారత్, రష్యాలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను భూమి, సముద్రం, వైమానిక మార్గాల ద్వారా శత్రువులపైకి అత్యంత వేగంగా ప్రయోగించవచ్చు. రష్యా దేశంతో యూఏఈకి ఉన్న సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాల కారణంగా ఈ క్షిపణుల ఎగుమతి ప్రక్రియకు ఎలాంటి సాంకేతిక అవరోధాలు ఎదురుకావని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన 'ఆకాశ్‌తీర్' వ్యవస్థ శత్రు విమానాలు, డ్రోన్ల ఉనికిని యుద్ధరంగంలో వేగంగా పసిగట్టి, తిప్పికొట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**పెరుగుతున్న రక్షణ ఎగుమతులు**
రక్షణ ఉత్పత్తుల స్వదేశీ తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణల వల్ల భారత్ నుండి రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. మార్చి 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ ఎగుమతులు తొలిసారిగా 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 37,868 కోట్లు) మైలురాయిని దాటడం గమనార్హం. గతంలో ఫిలిప్పీన్స్ దేశం భారత్ నుండి బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయగా, ఇండోనేషియా, వియత్నాం, థాయిలాండ్ తదితర దేశాలు కూడా వీటి పట్ల తీవ్ర ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ ప్రతిపాదిత రక్షణ ఒప్పందం పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే, గల్ఫ్ దేశాలలో భారతీయ రక్షణ సాంకేతికతకు మరింత గుర్తింపు లభిస్తుంది. అమెరికాకు చెందిన పేట్రియాట్, థాడ్ వంటి రక్షణ వ్యవస్థలను కలిగి ఉన్న యూఏఈకి, భారత్ 'ఆకాశ్‌తీర్' సాంకేతికత మరింత రక్షణ కవచంలా ఉపయోగపడనుంది. ఈ అంతర్జాతీయ రక్షణ సహకారం భారత్-యూఏఈ సరికొత్త వ్యూహాత్మక మైత్రికి బలమైన పునాది వేయడమే కాకుండా, ప్రపంచ వేదికపై స్వదేశీ రక్షణ ఉత్పత్తుల పరపతిని ఎంతగానో పెంచనుంది.

## రెండున్నర లక్షల రూపాయల విలువైన ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 22 :**
ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన ఆఫియా తబస్సుం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ఎల్ ఓ సి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని సోమవారం పటాన్చెరు లోని తన కార్యాలయంలోఆఫియా తబస్సుం కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, చంద్రశేఖర్, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


## శివాలయం తరుపున విద్యార్థులకు భోజన ప్లేట్ లు పంపిణీ...




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల రేణికుంట గ్రామంలోని ప్రాతమిక పాఠశాల విద్యార్థులకు గ్రామంలోని అతి పురాతన శ్రీ భవానీ శంకరస్వామి శివాలయం ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఆలయ అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం భోజన ప్లేట్ లు సోమవారం రోజు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీ రేగొండ పాండురంగం మాట్లాడారు... మన గ్రామంలోని పిల్లలని ప్రభుత్వ పాఠశాలకే పంపి గ్రామంలో మన బడి ఉనికి నిలబెట్టుకోవలసిన ఆవశ్యకత ఎంతైన ఉన్నది అని ఆలయ అర్చకులు పేర్కొనటం జరిగింది. రాబోయే రోజులలో ఇంకా అనేక విధాలుగా పాఠశాలకు సహాయ సహకారాలు అందచేస్తాము అని వారు తెలపారు. కావున తల్లి తండ్రులు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బుడిగె అంజయ్య, పుప్పాల నర్సయ్య, బూర్గు శేఖర్ రెడ్డి, వార్డ్ సభ్యులు బోళ్ళ సత్యకళ, బోళ్ళ ప్రభాకర్ రెడ్డి, రంగ నవీన్, ఆడెపు వెంకటేష్, కొంగరి శ్రీహరి మరియు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దూలపల్లిలో ఇనాం భూమి కబ్జా... పట్టించుకోని అధికారులు...

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22,కొంపల్లి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గండిమైసమ్మ మండలం దూలపల్లి పరిధిలోని కోట్లాది రూపాయల విలువైన భూమిని కొంతమంది అక్రమంగా నకిలీ రికార్డు సృష్టించి కబ్జా చేస్తున్నారు. సర్వే నంబర్ 150 లో దుర్గం దర్శన్, దుర్గం గోపాల్, దుర్గం


రశీదు
తేది: 9-9-1969
NOTE:- Duplicate Signature (B. Ranga Reddy)

అనిత అనే వ్యక్తిలు దొంగ సాధ భయానతో ఇనాం భూమిని వారి పేరు మీద రికార్డులు రాయించుకున్నాడు. ఇట్టి భూమికి దొంగ ఓ.ఆర్.సి సృష్టించారు. ఇట్టి ఓ.ఆర్.సి నెంబర్ జె/6400/98 జెసి కోర్టులో ఎంక్వయిరీ చేసి క్యాన్సిల్ చేయించాము. అయినా రెవెన్యూ రికార్డులో ధరణి పోర్టర్ లో వాళ్ల రికార్డును క్యాన్సల్ చేయకుండా ఎమ్మార్వో కాలయాపన చేస్తున్నారు. రికార్డు ఇంప్లిమెంటేషన్ మాకు చేసి ఓ.ఆర్.సి ఇవ్వగలరని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాము.

## యాంటీ డ్రగ్ అవేర్నెస్"పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరం కలిసికట్టుగా పోరాడాలి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నాడు "యాంటీ డ్రగ్ అవేర్నెస్" పోస్టర్లను జిల్లా ఎస్పి రోహిత్ రాజు ఐపీఎస్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్లకు పోస్టర్లు, బ్యానర్లు, యాంటీ డ్రగ్స్ సోల్జర్ సెల్ఫీ పాయింట్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జూన్ 22 నుంచి 26 వరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్ పరిధిలో గల పాఠశాలలు, కళాశాలలో, పట్టణాల్లో, గ్రామాలలో మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. సమాజంలో మార్పు వచ్చినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించగలమని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణా చేసిన వినియోగించిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భువనగిరి కోట అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి జూపల్లి





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని చారిత్రాత్మక భువనగిరి కోట అభివృద్ధి పనులను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. మంత్రికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, శ్రీ చంద్ర రచించిన భువన వైభవం పుస్తకం ను అందించడం జరిగింది. పర్యాటక అభివృద్ధితో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, నియోజకవర్గ అభివృద్ధికి ఈ పనులు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. కాంట్రాక్టర్ అలసత్వం లేకుండా నాణ్యమైన పనులు పూర్తి చేయాలని, దేశ, విదేశాల పర్యాటకులు వస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, మరియు అధికారులు పాల్గొన్నారు.

## సిపిఎం శిక్షణా తరగతులను జయప్రదం చేయండి...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఈ నెల 30 జూలై 1 రెండు రోజులపాటు పాలేరు మండలం షర్బనాపురం గ్రామంలో జరిగే సిపిఎం మండల పట్టణ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం రోజు సిపిఎం కార్యాలయంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్, సిపిఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, మండల నాయకులు సూదగాని సత్య రాజయ్య, సిఐటియు జిల్లా నాయకులు మోరిగాడి రమేష్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ మొరిగాడి చంద్రశేఖర్, నల్లమాస తులసయ్య, వడ్డేమాన్ బాలరాజు, మోరిగాడి అజయ్, చౌడబోయిన యాదగిరి, ఎండి ఖలీల్, యాసారపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సపావత్ శంకర్ మృతితో...

## అంజనాపురంలో విషాద ఛాయలు

**గ్రామాన్ని శోకసంద్రంలో ముంచిన మంచి మనిషి మరణం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
అంజనాపురం గ్రామం సోమవారం రోజు కన్నీరుమున్నీరైంది. గ్రామ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సపావత్ శంకర్ అకాల మరణం గ్రామాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఆయన మృతి వార్త తెలిసిన క్షణం నుంచి గ్రామమంతా శోకసంద్రంగా మారింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు, విద్యార్థుల నుంచి ఉపాధ్యాయుల వరకు ప్రతి ఒక్కరి కళ్లలో కన్నీటి ధారలు కనిపించాయి. సపావత్ శంకర్ కేవలం ఒక ఉపాధ్యాయుడు మాత్రమే కాదు. ఆయన ఒక మంచి మనసున్న వ్యక్తి, అందరినీ ఆప్యాయంగా పలకరించే స్నేహశీలి, విద్యార్థులకు మార్గదర్శి, గ్రామ ప్రజలకు ఆత్మీయుడు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి సాయం చేసే గుణం ఆయన సొంతం. తన చిరునవ్వుతో అందరినీ ఆకట్టుకునే ఆయన, తన సరళ స్వభావంతో ప్రతి కుటుంబానికి చేరువయ్యారు.విద్యార్థుల పట్ల ఆయన చూపిన ప్రేమ, వారికి అందించిన ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేనివని పలువురు విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. "సార్ మాకు ఉపాధ్యాయుడు మాత్రమే కాదు, తండ్రిలాంటి వారు" అంటూ విద్యార్థులు బోరున విలపించారు. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ, వారి భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేసిన



ఉపాధ్యాయుడిగా ఆయన గుర్తింపు పొందారు. తోటి ఉపాధ్యాయులతో ఆయనకు ఉన్న అనుబంధం కూడా ఎంతో గొప్పది. సహచరుల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఆయనతో కలిసి పనిచేసిన ఉపాధ్యాయులు "శంకర్ లాంటి వ్యక్తిని మళ్లీ చూడటం కష్టం" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలతో ఆయనకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిది. ఏ శుభకార్యమైనా, ఏ కష్టమైనా ఆయన ముందుండేవారు. గ్రామ అభివృద్ధి, విద్యాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తూ అందరి గౌరవాన్ని సంపాదించారు. అందుకే ఆయన మరణవార్త విన్న వెంటనే గ్రామ ప్రజలు ఆయన ఇంటికి తరలివచ్చి కన్నీటి నివాళులు అర్పించారు. అంజనాపురం వీధులు ఈ రోజు నిశ్శబ్దంగా మారాయి. ప్రతి ఇంటిలో ఆయన గురించే చర్చ. ప్రతి హృదయంలో ఆయన జ్ఞాపకాలే. మంచి మనసు, మానవత్వం, సేవాభావం కలిగిన వ్యక్తిని కోల్పోయామని గ్రామ ప్రజలు దుఃఖం వ్యక్తం చేస్తున్నారు."మంచి ఉపాధ్యాయుడు పాఠాలు మాత్రమే బోధించడు... జీవితాలను తీర్చిదిద్దుతాడు. సపావత్ శంకర్ అలాంటి మహోన్నత ఉపాధ్యాయుడు. ఆయన భౌతికంగా దూరమైనా, ఆయన బోధనలు, ఆయన ప్రేమ, ఆయన జ్ఞాపకాలు అంజనాపురం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి." సపావత్ శంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్నేహితులు కన్నీటి నివాళులర్పిస్తున్నారు.

# మండల కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలి....

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఆయా మండలాల ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీల ఏర్పాటు, గ్రామ శాఖల నియామకాలు, పార్టీ కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో గ్రామ శాఖల నియామక ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామ శాఖల నియామకాలు పూర్తయిన వెంటనే ఆయా మండలాల్లో మండల కమిటీ సభ్యుల నియామకాన్ని పూర్తి చేసి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలని నాయకులకు ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు బలమైన సంస్థాగత వ్యవస్థ అవసరమని, గ్రామ కమిటీలు మరియు మండల కమిటీలు పార్టీకి వెన్నెముకలాంటివని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఓటర్ల గుర్తింపు ప్రక్రియను క్రమబద్ధంగా నిర్వహించాలని, ప్రతి పోలింగ్ బూత్‌కు బాధ్యతగల నాయకులను గుర్తించి బూత్ ఏజెంట్ల వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా నాయకులు సమన్వయంతో పనిచేయాలని బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా న్యూజెర్సీలో ఘన నివాళి సభలో పాల్గొన్న జి.ఎం.ఆర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, నారాయణ ఖేడ్ :**
తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ ఆత్మగా చిరస్థాయిగా నిలిచిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం, లారెన్స్‌విల్ పట్టణంలో ఘనంగా నివాళి సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు , తెలంగాణ వాటర్ రిసోర్సస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, విద్యావేత్త డా. వి. ప్రకాశ్ అలాగే తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీ డి యఫ్ ) వ్యవస్థాపకులు మరియు ప్రముఖ తెలంగాణవాదులు హాజరయ్యారు.కార్యక్రమంలో ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం డా. వి. ప్రకాశ్ జయశంకర్ తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన చారిత్రాత్మక పాత్రను స్మరించుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా జయశంకర్ మార్గదర్శకత్వం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన అహర్నిశ కృషిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగపూరితంగా మాట్లాడారు. ఈ సందర్భంగా నేను ఎర్రబెల్లి దయాకర్ రావు మరియు డా. వి. ప్రకాశ్ తో నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించే అవకాశం లభించింది. ముఖ్యంగా లిబసవేశ్వర – సంగమేశ్వర ప్రాజెక్టులలి పూర్తి, సాగునీటి విస్తరణ, ప్రాంతీయ అభివృద్ధి మరియు ప్రజల ఆకాంక్షల సాధనపై సుదీర్ఘంగా చర్చించాము. డా. వి. ప్రకాశ్ లిబసవేశ్వర – సంగమేశ్వరలి ప్రాజెక్టుల ప్రాముఖ్యతను గుర్తిస్తూ, భవిష్యత్తులో అవకాశం వచ్చినప్పుడు ఈ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తప్పకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. నారాయణఖేడ్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై సానుకూలంగా, నిర్మాణాత్మకంగా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యూజెర్సీలోని ఎన్నో మంది ప్రవాస తెలంగాణవాసులు, బీఆర్ఎస్ నాయకులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ కోసం తన జీవితాన్నే



అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి తెలంగాణవాది బాధ్యత. ఆయన చూపిన బాటలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధికి కృషి చేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతాం. జీఎంర్ ఫౌండేషన్ చైర్మన్, బి ఆర్ యస్ పార్టీ నాయకులు గుజ్జపు మచ్చేందర్

## కొలనుపాక శ్రీ సోమేశ్వర ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా

# అభివృద్ధి చేస్తాం - మంత్రి జూపల్లి కృష్ణారావు






హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలోని ప్రాచీన, చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రివర్యులు, ప్రజాప్రతినిధులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అక్కడే ఉన్న వీరనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి ఆ ఆలయానికి పూర్వ వైభవం తీసుకుని రావాలని మంత్రిని కోరారు. వారు ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను పరిశీలించి ఆలయ అభివృద్ధి అవసరాలపై అధికారులతో చర్చించారు. దర్శనం అనంతరం నిర్వహించిన సమావేశంలో కొలనుపాక శ్రీ సోమేశ్వర ఆలయాన్ని రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాల సుందరీకరణ, రహదారి సౌకర్యాల మెరుగుదల, పార్కింగ్, విశ్రాంతి గదులు, తాగునీటి సదుపాయాలు, పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, కొలనుపాక ప్రాంతానికి చారిత్రాత్మక, ఆధ్యాత్మిక విశిష్టత ఉందని, ఈ ఆలయాన్ని రాష్ట్ర పర్యాటక పటంలో మరింత గుర్తింపు పొందేలా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన నిధుల కేటాయింపుపై సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, కొలనుపాక శ్రీ సోమేశ్వర ఆలయం రాష్ట్రంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన శైవక్షేత్రాలలో ఒకటని తెలిపారు. చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన ఈ ఆలయానికి తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి లింగాల చరిత్రను కలిగి ఉన్న ఏకైక ఆలయంగా కొలనుపాక సోమేశ్వర ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇంతటి విశిష్టత కలిగిన ఆలయ అభివృద్ధిపై గత ప్రభుత్వం సరైన దృష్టి సారించలేదని, ఆలయ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, కొలనుపాక సోమేశ్వర ఆలయాన్ని కూడా పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, పార్కింగ్ సదుపాయాలు, త్రాగునీరు, విశ్రాంతి గదులు, పరిశుభ్రత, రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ పరిసరాలను మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. కొలనుపాక సోమేశ్వర ఆలయం రాష్ట్ర పర్యాటక రంగంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయ చారిత్రక వైభవాన్ని భావితరాలకు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# వైద్య సిబ్బందిపై క్రిమినల్ కేస్ నమోదు చెయ్యాలి...

**వనజ మృతికి కారకులని కఠినంగా శిక్షించాలి**

**తక్షణమే బాధ్యుడిగా డి.ఎమ్.హెచ్.ఓ ను సస్పెండ్ చేయాలి....**

**కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలి....**

**మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** గుండాల పీహెచ్సీలో ఈ నెల 13వ తారీఖున డెలివరీ చేసి చాట్ల వనజ మృతికి కారకులైన వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ప్రభుత్వాసుపత్రిలోని అంబులెన్స్ను ఇతర మండలాలకు కేటాయించి ఏజెన్సీ ప్రజలకు అత్యవసర వైద్య సేవలను అందుబాటులో లేకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేషన్ వైఫల్యం చెందినందుకు, ప్రధాన బాధ్యుడిగా డీఎంహెచ్వోను వెంటనే సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం శంబునిగూడెం గ్రామంలోని చాట్ల వనజ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విచారణ పేరుతో అర్ధరాత్రి విచారణ చేపడుతూ తూతుమంతంగా చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. ఇంత జరిగిన వనజ కుటుంబానికి ప్రభుత్వపరంగా దహన సంస్కారాలకు కూడా ఆర్థిక సాయం అందించడంలో ఐటీడీఏ పీవో, కలెక్టర్ వైఫల్యం చెందారన్నారు. ప్రభుత్వం వనజ కుటుంబానికి 25 లక్షల ఎక్స్రేజెస్ చెల్లించాలని, వనజ భర్త సంజీవరావుకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వనజ కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ మంజు భార్గవి, తెల్లం భాస్కర్, పాయం నరసింహారావు, తిరుకోల్లూరి రాము, మోకాళ్ళ వీరస్వామి, గోగ్గేల రామయ్య, గడ్డం వీరన్న, హాఫిజ్, సుధాకర్, రాములు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి

# అందరి సహకారం అవసరం: కలెక్టర్ ప్రతీక్ జైన్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, సంగారెడ్డి ప్రతినిధి:**

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్--2026" కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో "నషా ముక్త్ భారత్ అభియాన్ -- వికసిత్ భారత్ కి పహచాన్" పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ అభివృద్ధికి కూడా తీవ్రమైన ముప్పుగా మారుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలు మరియు సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు కలిసి అవగాహన కల్పించినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్--2026" ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 14446 నేషనల్ డీ-అడిక్షన్ హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచిందని, అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన ప్రభుత్వ బాధ్యత



మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. లలితా దేవి, డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, ఆర్డీవో రాజేందర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. యువత తమ జీవిత లక్ష్యాలను సాధిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు.

# వెంకన్న మృతి రవాణా శాఖకు తీరని లోటు....

**భద్రాచలం ఎంవీఐ సంగం వెంకట పుల్లయ్య**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భూపాలపల్లి జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి (డీటీవో) ఎం. వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య సోమవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూపాలపల్లి ఆర్టీవో కార్యాలయం ఎదుట వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అతివేగంగా వచ్చిన టిప్పర్ వాహనం వెంకన్నపై నుంచి దూసుకెళ్లడంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తున్న సమయంలోనే ఆయన ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. ఇటీవలే బదిలీపై భూపాలపల్లికి వచ్చి నెల రోజులే గడవగా, విధి నిర్వహణలో ఉండగానే మృతి చెందడం మరింత బాధాకరమని అన్నారు. రవాణా శాఖలో క్రమశిక్షణ, అంకితభావంతో సేవలందించిన వెంకన్న మృతి శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. మృతుడు వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శివయ్య, సిబ్బంది నాగేశ్వరరావు, భీముడు తదితరులు పాల్గొన్నారు.

# జల్ జీవన్ మిషన్ - జల్ అర్పణ దివస్ అవగాహన కార్యక్రమం...

**తాళ్లగూడ సర్పంచ్ సట్లపల్లి గోవింద్ గౌడ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,జూన్ 22, షాద్నగర్ నియోజకవర్గం :** నందిగామ మండలం తాళ్లగూడ గ్రామంలో "జల్ జివన్ మిషన్ జల్ అర్పణ దివస్" కార్యక్రమంపై స్థానిక సర్పంచ్ సట్లపల్లి గోవింద్ గౌడ్ అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రాగునీరు, పారిశుద్ధ్యంలాంటి ప్రణాళికలను ప్రతిక్షణం సమక్షిస్తూ ఉండాలని అనవసరంగా నీటిని వృధా చేయకూడదు అని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు సర్పంచ్ సట్లపల్లి గోవింద్ గౌడ్ ని ప్రత్యేకంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మరియు గ్రామ ప్రజలు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. యువతకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పిలుపు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, సంగారెడ్డి ప్రతినిధి: జూన్ 26** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా యువత, విద్యార్థులు, ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో యాంటీ డ్రగ్ పోస్టర్లను ఆవిష్కరించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సమాజాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌డీఎస్పీ నరేందర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఎస్సై కావేరి, ఎస్-ఎన్‌వైఏబీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమెరికా-ఇరాన్ మధ్య కీలక దౌత్య చర్చలు.. భారత్‌కు ఊరటనిచ్చే ఆ నిర్ణయం ఏంటి?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, సెంట్రల్ డెస్క్ :**




అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరిగిన కీలక దౌత్య చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. ఈ భేటీలో భాగంగా 'లెబనాన్ డీ-కాన్ఫ్లిక్షన్ సెల్'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రాంతీయ స్థిరత్వం కోసం చర్చల ప్రతినిధులు 60 రోజుల గడువును నిర్ణయించారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించి, యుద్ధ వాతావరణం నెలకొనకుండా చూడటమే ఈ పరిణామం యొక్క ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లు ఈ పరిణామాల వల్ల ఇంధన ధరలు, వాణిజ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఈ ఒప్పందం వల్ల అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు కాస్త తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి సమీపంలో ఉన్న వేలాది మంది భారతీయ నావికుల భద్రతపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. మధ్యప్రాచ్య వాణిజ్య మార్గాల్లో త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల రానున్న నెలల్లో భారతీయ వినియోగదారులకు ఇంధన ధరలు స్థిరంగా అందుబాటులో ఉండవచ్చని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారు.

**బ్రెంట్ ఆయిల్, ఇండియన్ ఆయిల్ కంపెనీలపై స్విస్ చర్చల ప్రభావం**

స్విట్జర్లాండ్‌లో చర్చలు ముగియగానే బ్రెంట్ క్రూడ్ ధరల్లో కదలికలు మొదలయ్యాయి. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను నిర్ణయించే క్రమంలో ఇండియన్ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ మార్పులను నిశితంగా గమనిస్తున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ స్థిరంగా ఉండటం వల్ల చమురు దిగుమతుల భారం తగ్గుతుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గితే ఇంధన ధరలు అదుపులో ఉంటాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

| **సూచీ** | **ప్రస్తుత మార్కెట్ స్థితి** |
|---|---|
| బ్రెంట్ క్రూడ్ ధర | బ్యారెల్‌కు ప84.50 |
| డాలర్‌తో రూపాయి విలువ | 83.45 రూపాయలు |
| ఇంధన ధరల అంచనా | స్థిరం |

**భారతీయ నావికుల భద్రత.. హార్ముజ్ జలసంధి తాజా పరిస్థితి**

భారతీయ సిబ్బంది భద్రతను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ నిరంతరం పర్యవేక్షిస్తోంది. సముద్ర మార్గాల్లో ప్రయాణం సురక్షితంగా ఉండేలా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇతర దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. హార్ముజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో తెరిస్తే, భారతీయ నౌకల ఇన్సూరెన్స్ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్షియన్ గల్ఫ్ మీదుగా ప్రయాణించే కంపెనీలకు ఎప్పటికప్పుడు అలర్ట్స్ పంపడం వల్ల రూట్ ప్లానింగ్ సులభమవుతుంది.

విమాన మార్గాల మళ్లింపు.. కార్గో సర్వీసుల్లో మార్పులు

యుద్ధ భయం ఉన్న ప్రాంతాల మీదుగా వెళ్లకుండా విమానయాన సంస్థలు తమ రూట్లను మారుస్తున్నాయి. దీనివల్ల యూరప్ వెళ్లే అంతర్జాతీయ విమానాలకు సమయం, ఇంధన ఖర్చు భారీగా పెరుగుతోంది. ఫలితంగా ఈ పరివర్తన కాలంలో ప్రయాణికులపై విమాన టికెట్ల భారం పడే అవకాశం ఉంది. కార్గో సర్వీసుల్లో కూడా జాప్యం జరుగుతుండటంతో అంతర్జాతీయంగా నిత్యావసర వస్తువుల సరఫరాపై ప్రభావం పడవచ్చు. ఈ ఒప్పందాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలు అవుతాయనేది రాబోయే 72 గంటల్లో తేలిపోనుంది. అశాంతితో రగులుతున్న ఈ ప్రాంతంలో శాంతి నెలకొంటుందనే ఆశలు ఈ దౌత్య చర్చలతో చిగురించాయి. విదేశాల్లో ఉన్న తమ పౌరుల భద్రత విషయంలో భారత్ ఆశాభావంతో ఉంది. పరస్పర సహకారం ఉంటే ఎంతటి క్లిష్ట సవాళ్లనైనా అధిగమించి మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి.

## సమస్య చెప్పండి... పరిష్కారం మా బాధ్యత: ప్రజలకు ఎస్పీ భరోసా

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, సంగారెడ్డి ప్రతినిధి:**



సంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో పరిష్కారం కాని సమస్యలు ఉన్నప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, త్వరితగతిన న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సేవాభావంతో పనిచేస్తూ, బాధితులకు న్యాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్పష్టం చేశారు.

# మమతా బెనర్జీకి ఊహించని షాక్.. టీఎంసీ నుంచి అవుట్.. మేనల్లుడు కూడా..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 22, సెంట్రల్ డెస్క్ :**



పశ్చిమ్ బెంగాల్ ప్రధాన ప్రతిపక్షం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత విభేదాలు పరాకాష్టకు చేరాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వానికి గట్టి సవాల్ విసురుతూ, అసమ్మతి వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం ఎమ్మెల్యే అరూప్ రాయ్ ను పార్టీ నూతన చైర్మన్ గా ఎన్నుకుంది. దీంతో మమతా బెనర్జీ ఏకఛత్రాధిపత్యానికి పెద్ద దెబ్బ తగిలినట్లయింది. కోల్‌కతాలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తిరుగుబాటు విభాగం ఈ మేరకు నూతన కమిటీని ప్రకటించింది. మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్, ఎమ్మెల్యేలు ఫిర్హాద్ హకీమ్, రథిన్ ఘోష్, సబీనా యాస్మిన్ లను వైస్ చైర్మన్ లుగా నియమించారు. రితబ్రత బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహాలను జనరల్ సెక్రటరీలుగా ఎంపిక చేశారు. ఈ నిర్ణయాలను త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించి, తమదే అసలైన టీఎంసీగా క్లెయిమ్ చేయాలని ఈ గ్రూపు యోచిస్తోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఎంసీలో అసంతృప్తి జ్వాలలు రగిలాయి. కొద్ది రోజుల క్రితమే మొత్తం 80 మంది పార్టీ ఎమ్మెల్యేలలో 58 మంది రితబ్రత బెనర్జీకి మద్దతు ప్రకటించారు. అలాగే, పార్లమెంట్‌లోనూ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. లోక్‌సభలోని 28 మంది టీఎంసీ ఎంపీలలో 20 మంది ప్రత్యేక సమూహంగా ఏర్పడి, నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యారు. వీరంతా కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మద్దతు పలికారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ వ్యవస్థాపకురాలు మమతా బెనర్జీ పట్ల తిరుగుబాటు నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఆమె తమ వర్గానికి ప్రధాన సలహాదారుగా ఉండాలనుకుంటే సాదరంగా ఆహ్వానిస్తామని రితబ్రత బెనర్జీ పేర్కొనడం గమనార్హం. పార్టీ రాజ్యాంగ నిబంధనలకు లోబడే ఈ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించామని, త్వరలోనే జిల్లా కమిటీలను కూడా ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు తిరుగులేని శక్తులుగా వెలిగిన ప్రాంతీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం కరువైనప్పుడు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఈ సంక్షోభం నిరూపిస్తోంది. ఇప్పుడు అసలైన తృణమూల్ అధికారం ఎవరిదనే అంశంపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోనుంది. ఈ రాజకీయ పరిణామాలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో నూతన సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది.

## ఇక పాకిస్తాన్‌కు సినిమానే..! భారత్ కు అమెరికా వేల కోట్ల గిఫ్ట్



సరిహద్దుల్లో చైనా, పాకిస్తాన్ మనల్ని కంట్రోల్ చేయాలని ఎంత స్కెచ్ వేసినా.. భారత్ మాత్రం తన రక్షణ సామర్థ్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూనే పోతోంది. తాజాగా భారత సాయుధ దళాల అమ్ములపొదిని మరింత పటిష్టం చేసేలా అగ్రరాజ్యం అమెరికా ఒక సూపర్ గుడ్ న్యూస్ చెప్పింది. మన ఆర్మీ దగ్గరున్న మోస్ట్ పవర్‌ఫుల్ 'అపాచీ' హెలికాప్టర్లు, హిమాలయ పర్వతాల్లో శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించే 'ఎమ్-777 అల్ట్రా-లైట్ హోవిట్జర్' ఫిరంగుల కోసం సుమారు 482.2 మిలియన్ డాలర్ల (మన కరెన్సీలో ?4,000 కోట్లకు పైగా) సైనిక ప్యాకేజీని అమెరికా ప్రభుత్వం ఆమోదించింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా అమెరికా ఈ మెగా డీల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**చైనా బార్డర్‌లో గర్జించే 'హోవిట్జర్లు'.. ఇక నిరంతర ఆపరేషన్లు!**

తూర్పు లడఖ్ లాంటి మంచు కొండల్లో, శ్వాస తీసుకోవడమే కష్టమయ్యే హిమాలయ యుద్ధ క్షేత్రాలలో మన సైన్యానికి కొండంత అండగా నిలిచేవి 'ఎం777ఏ2 అల్ట్రా-లైట్ హోవిట్జర్లు'. చాలా తేలికగా ఉండటం వల్ల వీటిని హెలికాప్టర్ల ద్వారా ఎక్కడికైనా ఈజీగా మార్చవచ్చు. ఈ ఫిరంగులకు ఎలాంటి సాంకేతిక లోపాలు రాకుండా, నిరంతరం పనిచేసేలా చూసేందుకు ఈ ప్యాకేజీలో 230 మిలియన్ డాలర్లను కేటాయించారు. దీని ద్వారా వీటికి అవసరమైన విడిభాగాలు, మరమ్మతుల సేవలు, మన సైనికులకు ప్రత్యేక శిక్షణ లభిస్తాయి. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ రక్షణ సంస్థ 'బిఏఈ సిస్టమ్స్' ఈ సహాయక కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించనుంది.

**ఆకాశంలో శత్రువుల పీడకల 'అపాచీ'..**

ప్రత్యర్థులపై డేగ కళ్లతో నిఘా ఉంచి, ఖచ్చితమైన దాడులు చేయడంలో ప్రపంచంలోనే నంబర్ వన్ రక్షణ సామర్థ్యం గల హెలికాప్టర్లు 'ఏహెచ్-64ఈ అపాచీ'. మన ఆర్మీ ఆధీనంలోని ఈ 'ఫ్లయింగ్ ట్యాంకులను' ఎప్పుడూ యుద్ధానికి సిద్ధంగా (రౌండ్-ది-క్లాక్) ఉంచేందుకు 198.2 మిలియన్ డాలర్ల మద్దతును అమెరికా ప్రకటించింది. దీనికి సంబంధించిన ఇంజనీరింగ్ సేవలు, లాజిస్టిక్స్ సపోర్ట్‌ను అమెరికన్ టాప్ కంపెనీలైన 'బోయింగ్', 'లాక్‌హీడ్ మార్టిన్' అందించనున్నాయి. దీనివల్ల యుద్ధ రంగంలో మన అపాచీలు మరింత వేగంగా, పవర్‌ఫుల్‌గా స్పందించే అవకాశం ఉంటుంది.

**పక్కా ప్లాన్‌తో అమెరికా గ్రీన్ సిగ్నల్**


ఈ వ్యవహారంలో అమెరికా విదేశాంగ శాఖ మే 18నే అక్కడి కాంగ్రెస్‌కు ప్రతిపాదనలను పంపగా.. జూన్ 17న అధికారికంగా ఫెడరల్ రిజిస్టర్‌లో ఇవి ప్రచురితమయ్యాయి

ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినదు - పెంటగాన్

"ఈ అదనపు సైనిక సహకారం వల్ల ఈ ప్రాంతంలో సైనిక సమతుల్యత ఏమాత్రం దెబ్బతినదు. భారత్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి, సరిహద్దు సవాళ్లను నిలువరించడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది" అని అమెరికా రక్షణ ప్రధాన కార్యాలయం 'పెంటగాన్' స్పష్టం చేసింది. ఈ కొత్త సేవలను భారత సైన్యం చాలా సులభంగా తన దళాలలోకి అనుసంధానం చేసుకోగలదని, ఇరు దేశాల మధ్య నానాటికీ బలపడుతున్న వ్యూహాత్మక సంబంధాలకు ఈ ఒప్పందమే నిదర్శనమని యూఎస్ అధికారులు వెల్లడించారు. ఈ నిర్ణయంతో బార్డర్‌లో మన సైన్యం పవర్ మరింత నెక్స్ట్ లెవెల్‌కు చేరినట్లయింది!

## భర్తను హత్య చేసిన భార్య

మన్సూరాబాద్, జూన్ 22 : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను ఓ భార్య హత్య చేసిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించగా.. అనుమానంతో పోలీసులు లోతుగా విచారించి భర్తను హత్య చేసిన భార్యను అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ కథనం ప్రకారం.. ఎల్బీనగర్, ఎన్టీఆర్‌నగర్‌లో బోడ నర్సింగ్ భార్య బోడ స్వరూపతో కలిసి నివాసముంటున్నాడు. స్వరూపకు తన సొంత గ్రామానికి చెందిన మోహన్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఆమెలో మార్పు రాలేదు. తరచూ భర్త అడ్డుపడుతుండటంతో ఎలాగైన నర్సింగ్‌ను అంతమొందించాలని పథకం వేసుకుంది. ఈ నెల 20న నర్సింగ్, స్వరూప మధ్య తీవ్రంగా గొడవ జరిగింది. అనంతరం భర్తపై దాడి చేసింది. కింద పడ్డ భర్త చాతిపై కూర్చుని చున్నీతో గొంతును గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు శవాన్ని ఇనుప మంచానికి చున్నీతో కట్టి ఆత్మహత్య చేసుకున్నాడని చుట్టు పక్క వారిని నమ్మించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. శవపరీక్షలో నర్సింగ్‌ది ఆత్మహత్య కాదని తేలింది. గొంతు నులిమి చంపడం వలనే నర్సింగ్ మృతి చెందాడని వైద్యులు నివేదిక ఇచ్చారు. వైద్యుల నివేదిక ఆధారంగా పోలీసులు నిందితురాలైన స్వరూపను సోమవారం మధ్యాహ్నం అల్కాపురి చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు.





## నా కెరీర్‌కుథియేటరే పునాది..

ప్రముఖ టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తన నటన ప్రస్థానం గురించి, కెరీర్ తొలినాళ్లలోని అనుభవాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నటనపై తనలో ఆసక్తిని పెంచడంలో, తనను తాను నటుడిగా తీర్చిదిద్దుకోవడంలో థియేటర్ (రంగస్థలం) కీలక పాత్ర పోషించిందని ఆయన వెల్లడించారు. తన కెరీర్‌కు థియేటర్ అనుభవమే బలమైన పునాది వేసిందని స్పష్టం చేశారు.తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ విజయ్ మాట్లాడుతూ.. "కెరీర్ ప్రారంభంలో ఫలానా ప్రాజెక్ట్ చేయాలని ఎంచుకునే అవకాశం నాకు లేదు. ఏ పని దొరికినా, ఏ వేదిక దొరికినా దాన్ని సద్వినియోగం చేసుకోవాలనే తపన మాత్రమే ఉండేది. నా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, నా ప్రతిభను ప్రజలకు చూపించడానికి ఏదో ఒక అవకాశం కావాలి అనుకునేవాడిని" అని వివరించారు. చిన్న వయసులోనే తనలోని శక్తిని సరైన మార్గంలో పెట్టేందుకు రంగస్థలం ఎంతగానో దోహదపడిందని విజయ్ తెలిపారు. నటుడిగా, వ్యక్తిగా తనను తీర్చిదిద్దడంలో థియేటర్ పాత్ర ఎంతో ఉందని అన్నారు. థియేటర్ మనలోని బంధనాలను తెంచి, మనకు స్వేచ్ఛను ఇస్తుందని, నటుడిగా పూర్తిగా విముక్తి కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఇక, విజయ్ కెరీర్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తన భార్య, నటి రష్మిక మందన్నతో కలిసి 'రణబాలి' అనే పీరియాడిక్ డ్రామాలో నటిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న మూడో చిత్రమిది. వివాహం తర్వాత వీరిద్దరూ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనుండటం ఇదే తొలిసారి కావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. 1850ల నాటి వాస్తవ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. చరిత్ర పుస్తకాల్లోకి ఎక్కని, బ్రిటిష్ వారు తప్పుగా చిత్రీకరించారని ఆరోపణలున్న కొన్ని ఘటనలను ఈ సినిమా వెలుగులోకి తీసుకురానుందని సమాచారం. ఈ చిత్రంతో పాటు 'రౌడీ జనార్దన', 'ఎస ఇ శౌర్యువ్ (వర్కింగ్ టైటిల్)' అనే మరో రెండు ప్రాజెక్టులు కూడా విజయ్ చేతిలో ఉన్నాయి.




## 3 రోజుల్లో 'మా ఇంటి బంగారం' కలెక్షన్లు ఎంతంటే?

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ నెల 19న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, తొలి వారాంతంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 43 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. 'బ్లాక్‌బస్టర్ బంగారం' అని పేర్కొంటూ విడుదల చేసిన ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. విడుదలైన తొలి రోజైన శుక్రవారం ఈ సినిమా రూ. 13.15 కోట్ల గ్రాస్ రాబట్టింది. రెండు రోజులు ముగిసేసరికి వసూళ్లు రూ. 28 కోట్లను దాటాయి. ఇక, వీకెండ్‌లో చివరి రోజైన ఆదివారం నాడు కలెక్షన్లు మరింత పెరిగాయి. ఒక్క ఆదివారమే ఏకంగా రూ. 15 కోట్ల గ్రాస్ వసూలు చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న వసూళ్ల సరళిని బట్టి చూస్తే, ఈ చిత్రం త్వరలోనే రూ. 50 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.ఫ్యామిలీ క్రైమ్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణతో చిత్రయూనిట్ ఆనందం వ్యక్తం చేస్తోంది.

# SPORTS

## డ్రగ్స్ టెస్టుకు నిరాకరణ..
## వింబుల్డన్ మాజీ ఛాంపియన్‌పై నిషేధం..!

మహిళల టెన్నిస్‌లో ఓ వెలుగు వెలుగిన మార్కెటా ఒండ్రుసోవా నిషేధానికి గురైంది. డోపింగ్ టెస్టుకు నిరాకరించినందుకు భారీ మూల్యంగా ఆమె నాలుగేళ్లు ఆటకు దూరమవ్వనుంది. అథ్లెట్లు నిషేధిత డ్రగ్స్ ఉపయోగించారా? లేదా? అనేది తేల్చడం కోసం నిర్వహించే డోప్ పరీక్షల్ని తిరస్కరించిన ఒండ్రుసోవాపై స్వతంత్ర ట్రిబ్యునల్ విచారణ జరిపింది. ఆమె ఉద్దేశపూర్వకంగానే టెస్టుకు అంగీకరించలేదని తేలడంతో టెన్నిస్ నుంచి నాలుగేళ్లు సస్పెండ్ చేసింది.వింబుల్డన్ మాజీ ఛాంపియన్ అయిన ఒండ్రుసోవా నిరుడు డిసెంబర్‌లో డోప్ పరీక్షలకు నిరాకరించింది. ఆమెకు పరీక్షలు చేసేందుకు వెళ్లిన డోపింగ్ నియంత్రణ అధికారిని తను ఇంట్లోకి రానివ్వలేదు. దాంతో, అంతర్జాతీయ టెన్నిస్ సమగ్రత ఏజన్సీ ఆమెపై కేసు వేసింది. స్వతంత్ర ట్రిబ్యునల్ విచారణలో తాను ఒత్తిడిలో, మానసిక ఆరోగ్యం బాగా లేనందున తాను డోప్ టెస్టుకు సిద్ధపడలేని ఒండ్రుసోవా తెలిపింది.కానీ, ఆవేవీ సహేతుకమైన కారణాలు కాదని ట్రిబ్యునల్ తేల్చింది. దాంతో, ఉద్దేశపూర్వకంగానే టెస్టుకు దూరమైన ఆమెపై నాలుగేళ్ల నిషేధం విధించింది.




2030 జూన్ 31 వరకూ ఒండ్రుసోవాపై నిషేధం కొనసాగుతుందని ట్రిబ్యునల్ తెలిపింది. కోర్టు తీర్పును స్పోర్ట్స్ అర్బిట్రేషన్ కోర్టులో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి సవాల్ చేసే అవకాశముంది.

## పాండ్యాను వదిలేస్తున్న ముంబై.. రాజస్థాన్‌తో డీల్ కుదిరేనా..!

: ఐపీఎల్‌లో మరో భారీ డీల్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. సారథిగా విఫలమవుతున్న హార్దిక్ పాండ్యా ను వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమవుతోంది. ఐదుసార్లు ఛాంపియన్ ముంబై పాండ్యా కెప్టెన్సీలో అనామక జట్టుగా మారడంపై ఆగ్రహించిన యాజమాన్యం.. రాజస్థాన్ రాయల్స్) కు అతడిని అప్పగించేందుకు పావులు కదుపుతోంది. బదులుగా రాజస్థాన్ స్టార్ ఆటగాడిని ఇవ్వాల్సిందిగా ముంబై పట్టుపడుతున్నట్టు సమాచారం.´అయితే.. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ తప్ప.. ఎవరినైనా ట్రేడ్ డీల్ ద్వారా మార్చుకునేందుకు జైపూర్ ఫ్రాంచైజీ ఆసిక్తి కనబరుస్తోంది.ఈమధ్య ఐపీఎల్ సీజన్ ముగియడమే ఆలస్యం.. కొన్ని జట్లు ఆటగాళ్లను ట్రేడింగ్ పద్ధతిన మార్చుకోవడం చూస్తున్నాం. ఈసారి ముంబై ఇండియన్స్ తమ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను ఈ విధానంలో వదిలించుకోవాలని భావిస్తోంది. మూడేళ్ల క్రితం గుజరాత్ టైటాన్స్ నుంచి భారీ మొత్తం(దాదాపు రూ.100 కోట్లు)లో పాండ్యాను దక్కించుకున్న ముంబై.. అతడిని వద్దనుకుంటోంది.గత మూడు సీజన్లలో ముంబై ఆట అధ్వాన్నంగా మారడం.. పాండ్యాపై అంతర్గత వ్యతిరేకత వంటివి ఈ నిర్ణయానికి దారి తీశాయి. మాజీ సారథి రోహిత్ శర్మ కెరీర్ ముగింపు దశలో ఉండడం.. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆటలో మునపటి వేగం తగ్గడం ముంబైని కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలో ధనాధన్ ఆటతో శుభారంభాలు ఇవ్వగల యశస్వీ లాంటి ఓపెనర్ అవసరం ముంబైకి ఏర్పడింది.



## భారత్‌తో పొట్టి సిరీస్..
## ఐర్లాండ్, ఇంగ్లండ్ స్క్వాడ్ ప్రకటన..!



: వన్డే సిరీస్‌లో అఫ్గనిస్థాన్‌ను వైట్‌వాష్ చేసిన భారత జట్టుతో ఇంగ్లండ్, ఐర్లాండ్ అమీతుమీకి సిద్ధమవుతున్నాయి. స్వదేశంలో టీమిండియాతో పొట్టి సిరీస్ సమీపిస్తున్నందున ఇరు దేశాలు బోర్డులు సోమవారం తమ స్క్వాడ్‌ను ప్రకటించాయి. హ్యారీ బ్రూక్ సారథిగా ఇంగ్లండ్ వేల్స్ బోర్డు 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. ఐర్లాండ్ క్రికెట్ మాత్రం 14 మందినే తీసుకుంది. రెండు టీ20ల సిరీస్‌కు ఐరిష్ జట్టుకు లొర్కాన్ టక్నర్ కెప్టెన్‌గా వ్యవరహించనున్నాడు.స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు, వన్డే సిరీస్ గెలుచుకున్న భారత జట్టు విదేశీ పర్యటనలతో బిజీ కానుంది. జూన్ 26న ఐర్లాండ్‌తో.. ఆపై జూలై 1 నుంచి ఇంగండ్ జట్టుతో టీ20 సిరీస్‌లో తలపడనుంది టీమిండియా. ఈ నేపథ్యంలో ఐర్లాండ్ క్రికెట్ సోమవారం లొర్కాన్ టక్నర్ కెప్టెన్‌గా 14 మందితో నిండిన స్క్వాడ్‌ను ఎంపిక చేసింది.ఇంగ్లండ్ వేల్స్ బోర్డు సైతం హ్యారీ బ్రూక్ సారథిగా 17 మందిని తీసుకుంది. ఓపెనర్ బెన్ డకెట్‌పై వేటు పడగా.. సకీబ్ మహమూద్, జోర్డన్ కాక్స్, బేకర్ తిరిగి స్క్వాడ్‌లోకి రాగా.. జేమ్స్ కొలెస్ తొలిసారి టీ20లకు ఎంపికయ్యాడు. భారత్, ఐర్లాండ్ మధ్య జూన్ 26 శుక్రవారం తొలి టీ20 జరుగనుంది. ఆదివారం జూన్ 28న రెండో మ్యాచ్ ఉంటుంది. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది టీమిండియా. జూలై 1 నుంచి ఇరుజట్ల మధ్య పొట్టి సంగ్రామం మొదలవ్వనుంది. అనంతరం వన్డే సిరీస్ కూడా ఉండనుంది.ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో శ్రేయస్ అయ్యర్ సారథిగా, తిలక్ వర్మ డిప్యూటీగా వ్యహరించనుండగా.. యువకెరటం వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్ స్టార్ పేసర్ ప్రిన్స్ యాదవ్‌లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.